నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చంపాపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ స్పష్టం చేశారు. చంపాపేట పాతబస్తీ, కటకోనికుంట, సాయిరాంనగర్, ఆర్‌టీసీ, ఆఫీసర్స్, వైశాలీనగర్, నాగార్జున, భానునగర్, సింగరేణి, కేశవనగర్ పరిసర కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన అన్నారు.

జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో జరుగుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాలువ నిర్మాణం సందర్భంగా తాగునీరు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్లకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ హేమకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి సిబ్బంది బాలు, కమలానగర్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగుల స్వయం ఉపాధి పథకం గడువు పొడిగింపు

చాదర్‌ఘాట్: దివ్యాంగుల స్వయం ఉపాధి పథకం గడువు ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఎండీ బి.శైలజ తెలిపారు. మలక్‌పేటలోని సంక్షేమ భవనంలో శుక్రవారం వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంఘాల వినతి మేరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. అదే విధంగా ఆదాయం సర్టిఫికెట్ లేని వారు రేషన్ కార్డు అప్‌లోడ్ చేసే విధంగా ఆన్‌లైన్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు. స్వయం ఉపాధి పథకం కింద ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

పేద జంటకు ఉచితంగా వివాహం



వధూవరులను ఆశీర్వదిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, ఉపేందర్‌గుప్తా

నాగోలు: పేద జంటలకు వివాహం జరిపించడం పూర్వజన్మ సుకృతమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్‌లోని నాగేశ్వర్‌నగర్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో సుమన్‌కు- మౌనికతో శుక్రవారం వివాహం జరిపించారు. ఆర్థిక స్తోమత లేని యువతీ యువకులను వివాహాలు జరిపిస్తున్న మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తాకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా, సభ్యులు తుమ్మల బాల్‌రెడ్డి, సత్యనారాయణ, ఆనంద్, పవన్, ఇమ్మడి నారాయణ, విజయ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

హయత్‌నగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎదురుగా వస్తున్న బైకును ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో బైకుపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లగొండ జిల్లా రావిపహాడ్‌కు చెందిన కుంచం మల్లయ్య(42) కుంట్లూర్ నుంచి హయత్‌నగర్‌కు తన బైకుపై వస్తుండగా కుంట్లూర్ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న హయత్‌నగర్-2 బస్ డిపోనకు చెందిన బస్సు వేగంగా బైకును ఢీ కొట్టింది. దీంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు దాటుతుండగా..

సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు మండలం సాదుతండాకు చెందిన తేచావత్ రమేష్(29) హయత్‌నగర్ శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం తన స్నేహితుడి అల్లుడు హర్షవర్ధన్‌ను అల్వాల్‌లో జేఈఈ పరీక్ష రాయించుకుని తిరిగి ఆర్టీసీ బస్సులో వచ్చి భాగ్యలత వద్ద రోడ్డు దాటుతుండగా ఎల్‌బీనగర్ వైపు నుంచి వేగంగా బైకుపై వచ్చిన ఓ విద్యార్థి రమేష్‌ను ఢీ కొట్టగా అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలు.. తరలించడంలో నిర్లక్ష్యం



హనుమాన్‌నగర్ కాలనీ రహదారి పక్కన నిర్మాణ వ్యర్థాలు



ద్వారకాపురి కాలనీలో రహదారి మధ్యలో మట్టికుప్పలు



న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన

చైతన్యపురి: రహదారుల మధ్యలో మట్టికుప్పలు, రోడ్డుపక్కన నిర్మాణ వ్యర్థాలు.. నెలల తరబడి అలాగే ఉన్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. చైతన్యపురి డివిజన్‌లోని ఏ కాలనీలో చూసినా రహదారులపై ఇదే దుస్థితి. ఇటీవలే సీసీ రోడ్డు వేశారు.. కానీ రహదారిపై డంప్ చేసిన మట్టి, నిర్మాణ సామాగ్రి తొలగించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. న్యూదిల్‌సుఖ్‌నగర్, ద్వారకాపురి కాలనీ, విద్యుత్‌నగర్, భవానీనగర్ ప్రాంతాల్లో రోడ్డు పక్కనే బిల్డింగ్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నెలలు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బిల్డింగ్ వ్యర్థాలు రహదారుల పక్కన డంప్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా ఫలితం లేకుండా లేదని అన్నారు. ఇళ్ల నిర్మాణం సమయంలో కొందరు చెట్లను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు కాలనీ రహదారుల పక్కనే ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు కష్టంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టికుప్పలు, నిర్మాణ వ్యర్థాలను తొలగింపజేయాలని కోరుతున్నారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని కొమ్మలను నరికివేశారు. వాటిని తరలించకుండా అక్కడే పడేశారు. దీంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని, విద్యుత్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



కాలనీల్లో రోడ్ల పక్కన ఉన్న బిల్డింగ్ వ్యర్థాలు, చెత్త కుప్పలు, చెట్ల కొమ్మలు నెలల తరబడి అలాగే ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దాంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలి.

– ఎండీ షాదుల్లా, చైతన్యపురి కాలనీ

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి



కేలండర్‌ను ఆవిష్కరణ చేస్తున్న సినీ నటుడు సుమన్, సదాశివుడు

నాగోలు: ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని, క్రమశిక్షణతో కూడిన శిక్షణ నేర్చుకోవాలని సినీ నటుడు సుమన్ అన్నారు. విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఇండియా చైర్మన్ కోమాకుల సదాశివుడు ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను శుక్రవారం ఎల్‌బీనగర్‌లో సినీ నటుడు సుమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహించడం పట్ల అభినందించారు. విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులను తీర్చిదిద్దుతూ ఎస్‌జీఎఫ్, యూనివర్సిటీ గేమ్స్, ఏషియన్ గేమ్స్‌లో క్రీడాకారులు పథకాలను సాధించడం పట్ల అభినందించారు. నారాయణ స్కూల్స్ జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కరాటేను ప్రోత్సహిస్తున్న సుమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బ్రాంచ్ ఏజీఎం వేణుగోపాల్, విక్టరీ చోటకార్ కరాటే అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆర్.మల్లికార్జున్ గౌడ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఎం.వెంకటేష్, కొయ్యడ ప్రసాద్ గౌడ్, బండి రామకృష్ణగౌడ్, భార్గవ్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్‌కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభం



అగ్రికల్చర్‌కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ సమగ్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. అగ్రికల్చర్ కాలనీలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించగా రూ.20 లక్షలతో చేపట్టనున్న అర్బన్ బయోడైవర్సిటీ పార్కు పనులకు కార్పొరేటర్ సుజాతనాయక్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ నుంచి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జితేందర్ రెడ్డి, జగత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పీఎల్ఎన్ శర్మ, రాము, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సీబీఎం హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సైదాబాద్: కార్పొరేట్ హాస్పిటల్ యాజమాన్యాలు అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకొని అందరికీ అందుబాటులో ఫీజులు ఉండేలా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. చంపాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన చిక్కుడు బాలయ్య మెమోరియల్ హాస్పిటల్‌ను శుక్రవారం ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలో ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులను మెరుగు పర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్కుడు బాలయ్య మెమోరియల్ హాస్పిటల్ నిర్వాహకులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, డాక్టర్ కటకం శ్రీనివాసాచారి, డాక్టర్ చిక్కుడు యశ్వంత్, డాక్టర్ యుక్త పాల్గొన్నారు.

మరమ్మతుల కారణంగా కరెంటు ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్‌కేపురం ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ లక్ష్మీగణపతి, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సరైన అవగాహనతో కుష్టు వ్యాధిని నయం చేయవచ్చు

హుడాకాంప్లెక్స్: బహుళ ఔషధ చికిత్స, సరైన అవగాహనతో కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని విశ్రాంత పారామెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సద్గుణాచారి చెప్పారు. కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సద్గుణాచారి మాట్లాడుతూ.. ఈ వ్యాధి మొదట స్పర్శ లేని మచ్చలతో ప్రారంభమవుతుందని, కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత పారామెడికల్ అధికారి సతీష్, సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రఘు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

మీర్‌పేట: కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట జిల్లెలగూడలోని జెనిగె అడివమ్మ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నామకరణం బోర్డును శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీవాసులంతా ఐకమత్యంగా ఉండి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరకృషి



పవనగిరికాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి రాజరాజేశ్వరీకాలనీ, శివంహిల్స్, పవనగిరికాలనీ ఫేజ్-3 కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలల క్రితమే నిధులు మంజూరై టెండర్ పనులు పూర్తయ్యాయని, కొన్ని కారణాలతో పనులు ప్రారంభించలేకపోయామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ర్యాంపులను కాలనీవాసులు స్వచ్ఛందగా తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మాధవరెడ్డి, హరినాథ్‌నేత, కొండ శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరిప్రసాద్, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింహుడు, నాయకులు సాయిరాంగౌడ్, యాదగిరియాదవ్, శ్రీధర్‌గౌడ్, జయతేజ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేసే వరకు పోరాటం



సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీలో డప్పులతో ప్రచారం

హస్తినాపురం: ఎస్సీ వర్గీకరణ అమలుకు వేల గొంతులు లక్షలాదిగా మాదిగలు తరలివచ్చి తమ సత్తా చాటాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తిన సుధాకర్‌మాదిగ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోష్ నగర్‌కాలనీలో పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీ గ్రూపులుగా విభజించాల్సిన అవసరం ఉందని, సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగన్మాత మరో రూపమే వాసవీ మాత



కొత్తపేటలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: లోక పావని అయిన జగన్మాత మరో రూపమే వాసవీ మాత అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శ్రీవాసవీ మాత సేవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని కమర్షల్ టాక్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలో నిర్వహించిన వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భగా వాసవీ మాత సేవ సమితి ఆధ్వర్యంలో 108 కలశలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, అధ్యక్షుడు గుండా రామ కోటేశ్వర రావు, వైస్ ప్రెసిడెంట్ భుషెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి మొట్కురి రమేష్, సంయుక్త కార్యదర్శి మధు, వెంకట రమణ, మురళి శేఖర్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, నరేష్, వంశీ కృష్ణ, మల్లికార్జునగుప్తా, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఆంజనేయులుకు నియామకపత్రం అందజేస్తున్న పిడమర్తి రవి

నాగోలు: మాదిగ జేఏసీ యువజన విభాగం ఎల్‌బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగోలు సాయినగర్ కాలనీవాసి కొమ్ము ఆంజనేయులును నియమించారు. మాదిగ జేఏసీ యూత్ కమిటీ అధ్యక్షుడు పిడమర్తి రవి శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

జాతరకు ఏర్పాట్లు చేయండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి జాతరకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) కోరారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్న జాతరను పురస్కరించుకొని శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడవిలో జరిగే ఈ జాతరకు వేలాది మంది భక్తులు విచ్చేయనున్న దృష్ట్యా రహదారిపై ఉన్న గోతులను మొరంతో నింపాలన్నారు. ఆలయం వద్ద నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్ బాబా, సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ యాదగిరి, నాయకులు షేక్ జహంగీరుద్దీన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

నాగోలు: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటీయూసీ నాయకులు నిరంతరం పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. న్యూనాగోలు కాలనీలో ఎస్‌కే డాంగే భవనంలో శుక్రవారం ఏఐటీయూసీ సరూర్‌నగర్, హయత్‌నగర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గం నిర్మాణ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, సహాయ కార్యదర్శులు కందుల సుధాకర్, బోయపల్లి రాములుగౌడ్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. సరూర్‌నగర్ మండల ఏఐటీయూసీ అధ్యక్షుడిగా పూజారి శ్రీను, కార్యదర్శిగా బోయినపల్లి రాములుగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి

తుక్కుగూడ: ప్రజాయుద్ధ నౌక, ఉద్యమకారుడు గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో గద్దర్ జయంతి వేడుకల సందర్భంగా శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ.. గద్దర్ జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, జానకిరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

అటవీ భూమిని పట్టా భూములుగా నమ్మించిన ముగ్గురి అరెస్టు



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

హస్తినాపురం: అటవీశాఖ భూములను తన పట్టా భూములని నమ్మించి ప్రజల వద్ద నుంచి డబ్బులు తీసుకుని ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తానని మోసం చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లోని అటవీశాఖ భూమి సర్వే నంబర్-7లో తనకు పట్టాభూమి ఉందని సంతోష్ నగర్‌కు చెందిన షేక్ జిలానీ(55), యూసుఫ్ ఖాన్(62), అతడి భార్య(60) ప్రజలను నమ్మించి భూమిని గిఫ్ట్ డీడ్ చేస్తామని చెప్పి ఒక్కొక్కరి దగ్గర రూ.5వేల నుంచి రూ.50 వేల వరకు ఎంతో మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. తాను హైకోర్టు న్యాయవాదినని చెప్పి షేక్ జిలానీ ప్రజలను నమ్మించి మోసం చేయడంతో ఆటోనగర్ అటవీశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

500 మంది మహిళలతో కుంకుమార్చన

మీర్‌పేట: జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆలయ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 500 మంది మహిళలతో ఆలయంలో సామూహిక కుంకుమార్చనతో పాటు హోమం, అభిషేకం చేశారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు గండె సురేష్ కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్‌గుప్తాలు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మీర్‌పేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మంచన ప్రేమ్‌కుమార్‌గుప్తా, కమిటీ సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలి

మహేశ్వరం: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీలో లబ్ధిదారుల ఎంపికలో తమకు మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీఓ శైలజకు వినతిపత్రం అందజేశారు. నిత్యం గ్రామాల్లో విధి నిర్వహణలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ఇవ్వడంతో ప్రజల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మూడు, నాలుగు గ్రామ పంచాయతీలను కలిసి మండల స్థాయి అధికారులకు నియమించి సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. ఎంపీడీఓ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవీన్, జావీద్, రాము, పరమేష్, శ్రీనివాస్, కృష్ణయ్య, సుజాత, లక్ష్మి, రాజు, పుష్ప, దివాకర్, కల్పన, జానయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట మాజీ మేయర్‌కు సత్కారం



మీర్‌పేట: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్‌లతో శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీర్‌పేట కార్పొరేషన్ మాజీ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌ను కేటీఆర్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జగదీశ్వర్‌రెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మాజీ మేయర్ దుర్గ మాట్లాడుతూ.. మేయర్‌గా మీర్‌పేట ప్రాంతానికి సేవ చేసేందుకు అవకాశం ఇచ్చిన బీఆర్ఎస్ అధిష్టానం, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మీర్‌పేట కార్పొరేషన్‌ను ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు.